క్లుప్తంగా

హోంగార్డును పరామర్శించిన పేర్ని కిట్టు



కోనేరుసెంటర్: జనసేన పార్టీ నాయకుడు కర్రి మహేష్ చేతిలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డు మోహనరావుని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) సోమవారం పరామర్శించారు. హోంగార్డు జరిగిన అవమానాన్ని కిట్టుకి చెబుతూ కన్నీరు చెమర్చాడు. వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందంటూ హోంగార్డుకు పేర్నికిట్టు ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన హోంగార్డుపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఇలాంటి ఘటనలు పరిపాటిగా మారాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంగార్డుకు జరిగిన అవమానాన్ని పోలీసుశాఖకు జరిగిన అవమానంగా భావించి అధికారులు కర్రి మహేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కిట్టుతో పాటు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

కోడూరు: వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)కు నూతనంగా నియమించిన త్రిసభ్య కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. కోడూరు పీఏసీఎస్ చైర్మన్‌గా పూతబోయిన కరుణకుమార్, సభ్యులుగా పూతబోయిన శ్రీనివాసరావు, మల్ల వెంకటేశ్వరరావు, సాలెంపాలెం చైర్మన్‌గా కొప్పనాతి సత్యనారాయణ, సభ్యులుగా మెండు బ్రహ్మయ్య, కొక్కిలిగడ్డ వరప్రసాద్ ప్రమాణ స్వీకారం చేశారు. జనసేన యువనేత మండలి వెంకట్రామ్ త్రిసభ్య కమిటీ సభ్యులను అభినందించారు. టీడీపీ, జనసేన పార్టీల మండలాధ్యక్షులు బండే శ్రీనివాసరావు, మర్రే గంగయ్య, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, పీసీ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



రేమాలవారిపాలెం(నాగాయలంక): మండలంలోని రేమాలవారిపాలెం గ్రామానికి చెందిన పేద విద్యార్థిని రేమాల నిహారిక ఇంజనీరింగ్ చదువు నిమిత్తం వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ చెన్ను రంగారావు ద్వారా రూ. 25వేలు ఆర్థిక సాయం అందచేశారు. ఈ మేరకు చెక్కును నాగాయలంక మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మోకా నాగప్రసాద్ విద్యార్థిని తండ్రి రేమాల పోతురాజుకు సోమవారం అందించారు. వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు తోట సాయిబాబు, రేమాల నాగరాజు, చిట్టా బాలపాపారావు, భోగాది రాధాకృష్ణ పాల్గొన్నారు.

కాపులకు ప్రత్యేక పథకాలు అమలు చేయాలి

నాగాయలంక: కాపుల సామాజికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేయాలని కోరుతూ నియోజకవర్గ కాపు నేతలు సోమవారం ఎంపీ వి.బాలశౌరికి వినతిపత్రం అందజేశారు. అలాగే నాగాయలంకలో కాపు కల్యాణ మండపం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. రెండు నెలల్లో నిధులు మంజూరు చేస్తానని ఎంపీ బాలశౌరి భరోసా ఇచ్చినట్లు కాపు నేతలు తెలిపారు. అవనిగడ్డ నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడు భోగాది సోమశేఖర్(చిన్నారి), ఉపాధ్యక్షుడు తోట శ్రీనివాసరావు, అర్జా బుచ్చిబాబు, భోగిరెడ్డి బుజ్జి, ముమ్మారెడ్డి నానారావు, పేటేటి సుబ్రహ్మణ్యం, పిరాటి అర్జున పాల్గొన్నారు.

సబ్‌జోన్ క్రీడా పోటీలు ప్రారంభం



కోడూరు: మండలంలోని వి.కొత్తపాలెం జెడ్పీ పాఠశాల క్రీడా ప్రాంగణంలో సోమవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అవనిగడ్డ సబ్ జోన్ క్రీడాపోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. పాఠశాలలో క్రీడాభివృద్ధికి రూ. 50వేలు, పోటీల నిర్వహణకు మరో రూ.50వేలు సుమంత్ ఎంటర్‌ప్రైజెస్ ఎండీ కేవీబీ రామమోహనరావు అందించినట్లు ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు తెలిపారు. దాత తండ్రి కోసూరు బాబురావుతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులకు క్రీడాదుస్తులు అందించిన దాతలను ఎమ్మెల్యే సత్కరించారు. హెచ్ఎంలు, పీఈటీలు, సీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

నేత్ర దానంపై అవగాహన

అవనిగడ్డ: స్థానిక ఎస్వీఎల్ క్రాంతి విద్యాసంస్థల ప్రాంగణంలో సుదర్శి మానవతా సేవాసంస్థ, అవనిగడ్డ ప్రెస్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ ఎల్వీ ప్రసాద్ నేత్రవైద్యశాల నేతృత్వంలో సోమవారం విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ నేత్రదానంపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, అవనిగడ్డ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి ఎ. శ్రీనివాసరావు, పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ సమావేశంలో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

చల్లపల్లి: ఎన్నికల హామీలు అమలు చేయడంతో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'పై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నగదు పంపిణీ, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇప్పటి వరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. తల్లికి వందనం మొదటి విడత డబ్బులు ఎక్కడికి వెళ్లాయో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. రాజధానికి మరో 40వేల ఎకరాలు కావాలని చంద్రబాబు చెప్పడాన్ని అన్ని వర్గాల నాయకులు వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను గెలిపించుకోకపోతే పేద ప్రజలకు మరింత అన్యాయం జరుగుతుందని ప్రజలు గొంతెత్తి చెపుతున్నారని పేర్కొన్నారు. జగన్‌ను మరలా సీఎంను చేసేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

ప్రజలకు చేసిందేమీ లేదు

కృత్తివెన్ను: కూటమి ప్రభుత్వం ఇంతవరకు ప్రజలకు చేసిన మంచి ఏమీ లేదని వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము విమర్శించారు. లక్ష్మీపురంలో సోమవారం బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత తుంగలో తొక్కారని విమర్శించారు. విద్యుత్ చార్జీలు పెంచి పేదలపై పెనుభారం మోపిన ఘనత బాబుదే అన్నారు. రైతు గురించి ఆలోచన చేయడంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డిలకు ఎవరూ సాటి రారన్నారు. చంద్రబాబుకు త్వరలోనే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కృత్తివెన్ను మండలంలో శివారుకు నీరు చేరలేదని, దీనిపై స్పందించాల్సిన ఎమ్మెల్యే మాత్రం చోద్యం చూస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు సంవృద్ధిగా యూరియా అందించాలని హితవు పలికారు. పార్టీ మండల కన్వీనర్ భూపతిరాజు, ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ సభ్యులు రత్నకుమారి, ఆర్టీసీ కృష్ణా రీజనల్ మాజీ చైర్మన్ మహేష్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గంగాధర్, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి విశ్వేశ్వరరావు, నాయకులు నాయుడు, మండల మాజీ కన్వీనర్ వెంకట్రాజు, మహిళా కన్వీనర్ ఝాన్సీ, జాన్‌రత్నం, సుబ్రహ్మణ్యం, రాము, శ్రీను, సాయి, మత్స్యకార నాయకులు టి. శ్రీనివాసరావు, గూడూరు ఎంపీపీ మధుసూదనరావు, సర్పంచ్‌లు కొల్లాటి రాజు, పిన్నెంటి ప్రభుప్రసాద్, ఆరోగ్యం, సామోరు, రైతు నాయకులు పిన్నెంటి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీపురం సభలో మాట్లాడుతున్న ఉప్పాల రాము

పింఛన్ల తొలగింపు దుర్మార్గం

పింఛన్ల తొలగింపుతో అర్హులైన వికలాంగులకు అన్యాయం చేసి కూటమి ప్రభుత్వం వారి పొట్టగొట్టడం అన్యాయమని వైఎస్సార్ సీపీ జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు కొల్లూరి శామ్యూల్ ఆవేదన వ్యక్తంచేశారు. తొలగించిన దివ్యాంగుల పింఛన్లను మరలా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేయక తప్పదని హెచ్చరించారు. చల్లపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి మాట్లాడుతూ నాయకుల దగ్గర నుంచి కార్యకర్త వరకూ ప్రతి ఒక్కరూ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శీసం వెంకట సత్యనారాయణ, పార్టీ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు రాజులపాటి శివ, అవనిగడ్డ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ అర్షద్, మండల మహిళా అధ్యక్షురాలు బొందలపాటి లక్ష్మి, నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, మత్తి రాంబాబు, పాగోలు నాగ సీతారామారావు, కేశనకుర్తి శరత్, చంద్ర దుర్గా బాబు, చంద్ర చిన్నిబాబు, పెద్దారెడ్డి, సయ్యద్ జహీర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక వర్గాలు ఐక్యతతో పోరాటాలు చేయాలి

సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు హేమలత



మాట్లాడుతున్న డాక్టర్ హేమలత

మచిలీపట్నంటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు కార్మిక వర్గాలు ఐకమత్యంతో పోరాడాలని సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ కే హేమలత పిలుపునిచ్చారు. స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఓ కల్యాణ మండపంలో సోమవారం 'దేశంలో కార్మికులు, ఉద్యోగుల ముందున్న సవాళ్లు - పరిష్కార మార్గాలు' అనే అంశంపై సీనియర్ కార్మిక సంఘ నాయకులు ఎస్ ధనుంజయరావు అధ్యక్షతన కామ్రేడ్ మధుసూదనరావు స్మారక ఉపన్యాసం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్, నల్ల చట్టాలను తిప్పి కొట్టాలని సూచించారు. సీఐటీయూ 18వ ఆల్ ఇండియా మహాసభలు నిర్వహణకు ఈసారి విశాఖపట్నం వేదిక కానుందని తెలిపారు. ఈ మహాసభలకు చైనా, క్యూబా తదితర సోషలిస్టు దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, జిల్లా అధ్యక్షుడు కొల్లెం వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు వై.నరసింహారావు, జిల్లా కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు, గ్రామిక మహిళల సంఘం కన్వీనర్ పర్చూరి ధనశ్రీ, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అంగత రమాదేవి, కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేత్ర దానం

అవనిగడ్డ: స్థానిక పంచాయితీ పరిధిలోని లంకమ్మ మాన్యంలో అనారోగ్యంతో మృతిచెందిన తోట ఫరీదు(58) నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. స్థానికుడు అలపర్తి గోపాలకృష్ణ ద్వారా మరణవార్త తెలుసుకున్న సుదర్శి మానవతా సేవా సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్ మృతుని భార్య, కుమారుడు బాబ్జిని సంప్రదించడంతో నేత్ర దానంకు అంగీకరించారు. విజయవాడ ఎల్వీ ప్రసాద్ నేత్రాలయం వైద్యులు సోమవారం వచ్చి ఫరీదు నేత్రాల నుంచి కార్నియాను సేకరించి తీసుకెళ్లారు.

నేడు మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

మచిలీపట్నంటౌన్: వినాయక చవితి పండుగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నగరపాలకసంస్థ కార్యాలయం వద్ద మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ బాపిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సంస్థ కార్యాలయంలో మట్టి వినాయక ప్రతిమలను అందజేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు

మచిలీపట్నంఅర్బన్: భారతీయ కళారూపాల పరిరక్షణలో భాగంగా ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యాన కళా ఉత్సవ్-2025 పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యా అధికారి పీవీజే రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి పోటీలు సెప్టెంబర్ 11, 12వ తేదీల్లో అంగలూరు డైట్ కళాశాలలో జరుగుతాయన్నారు. పోటీల్లో గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటకం, దృశ్య కళలు, సాంప్రదాయ కథల చెప్పడం వంటి విభాగాలు ఉంటాయన్నారు. తొమ్మిది నుంచి 12వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు వారిని ఎంపిక చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు డైట్ ప్రిన్సిపాల్, జిల్లా నోడల్ అధికారులు డాక్టర్ కె. మోహనరావు, వి.వి. సుబ్బలక్ష్మిలను సంప్రదించాలని సూచించారు.

జిల్లాస్థాయి సాఫ్ట్‌బాల్‌కు ఎంపిక

కె కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె.కొత్తపాలెం జెడ్పీ పాఠశాల పాఠశాల నుంచి జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్‌కు క్రీడాకారులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం గండు కృష్ణప్రసాద్ తెలిపారు. విజయవాడ వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో కృష్ణాజిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-15 విభాగంలో పాఠశాల నుంచి బాలుర విభాగంలో బి.దివి తేజ, టి.లలిత్ మణికంఠ, కె.బాబీ బాలికల విభాగంలో ఎం.రేష్మ, పి.జాహ్నవి ఎంపికైనట్లు తెలిపారు. సెప్టెంబర్ 22, 23, 24 తేదీల్లో విశాఖపట్నం జిల్లా వాల్తేర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో కృష్ణాజిల్లా జట్టుకు ఈ క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తారని హెచ్ఎం వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

నాలెడ్జ్ పార్కుకు రూ. 6.5 కోట్లు మంజూరు

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నగరంలో భోగరాజు పట్టాభి సీతారామయ్య నాలెడ్జ్ పార్కు ఏర్పాటు కోసం మొదటి దశలో రూ. 6.5 కోట్లు మంజూరైనట్లు ఎంపీ వల్లభనేని బాలశౌరి తెలిపారు. నగరంలోని ఆయన నివాసంలో సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ ఆంధ్రబ్యాంకు వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారకంగా నాలెడ్జ్‌పార్కును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిర్మాణం పూర్తయిన అనంతరం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. అలాగే గుడివాడ - కంకిపాడు గ్రీన్‌ఫీల్డ్ రహదారి, మచిలీపట్నం - విజయవాడ ఆరు లేన్ల రహదారి నిర్మాణాలకు కేంద్ర మంత్రి నిధులు మంజూరు చేసేందుకు హామీ ఇచ్చారన్నారు. మచిలీపట్నం పోర్టు అనుసంధానంగా రహదారులతో పాటు ఏడు అండర్ పాస్‌లు, మూడు ఫ్లైఓవర్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

గ్రామ సరిహద్దులు నిర్ణయించాలి

మోపిదేవి: మండలంలోని మోపిదేవిలంక గ్రామ సరిహద్దులు నిర్ణయించాలని ఆ గ్రామ సర్పంచ్ మోర్ల జ్యోత్స్న, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు తహసీల్దార్ వనజాక్షికి సోమవారం వినతిపత్రం అందజేశారు. మోపిదేవిలంక గ్రామ సరిహద్దు ప్రారంభం నుంచి నాగాయితిప్ప గ్రామ సరిహద్దు ప్రారంభం వరకు ఎల్పీ నెంబర్లలో సూచించిన భూమి విస్తీర్ణం, హద్దులు సర్వే చేసి ఎల్పీ నంబర్ల నకళ్లు ఇప్పించాలని వినతిపత్రంలో కోరినట్లు వివరించారు.

యూరియా బస్తా రూ.1,000

పట్టించుకోని అధికారులు

అవనిగడ్డ: యూరియా బస్తా ధర అక్షరాలా వెయ్యి రూపాయలు. అవును మీరు విన్నది నిజమే. 50కిలోల ఎంఆర్పీ ధర రూ.268, 45 కిలోల ధర రూ. 242 అమ్మాలి కానీ యూరియా కొరత వల్ల బయట వ్యాపారులు వారి ఇష్టం వచ్చినట్టు అమ్ముకుంటున్నారు. అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లో యూరియాకు బాగా డిమాండ్ పెరగడంతో ప్రస్తుతం ఒకటి రెండు చోట్ల మాత్రమే బయట వ్యాపారుల వద్ద యూరియా లభిస్తోంది. దీన్ని ఆసరాగా చేసుకున్న కోడూరు మండలంలోని మాచవరంలో ఓ వ్యాపారి రెండు రోజుల నుంచి యూరియా బస్తాని ఏకంగా వెయ్యి రూపాయలకు అమ్ముతున్నాడు. రైతులు అభ్యంతరం తెలిపితే తీసుకుంటే తీసుకోండి లేకపోతే పోండి అంటూ కసురు కుంటున్నాడని కొంతమంది రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు.

దోమల నివారణకు చర్యలు

పెడన: పట్టణంలో దోమల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టామని మలేరియా సబ్ డివిజనల్ అధికారి పి.మురళీ అన్నారు. సోమవారం పెడన పట్టణంలోని తామర చెరువు, మదరసా వద్ద మురుగు నీటిలో గంబూజీయ చేపలను పారిశుద్ధ్య సిబ్బందిచే వదిలి పెట్టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చేపలు దోమల లార్వా వృద్ధి చెందకుండా తినేస్తాయని తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ సతీష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ



గూడూరు: షెడ్యూలు కులాలకు చెందిన పాడి రైతులకు సబ్సిడీపై పశువుల దాణాను ఎంపీపీ సంగా మధుసూదనరావు సోమవారం పంపిణీ చేశారు. గూడూరు మండలానికి సంబంధించి 11 టన్నుల పశువుల దాణా ప్రభుత్వం మంజూరు చేయగా 50శాతం సబ్సిడీపై ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన పాడి రైతులకు పంపిణీ చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.1,110గా ఉన్న 50కిలోల దాణా సబ్సిడీపై రూ.555కు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు లింగం విజయ్‌కుమార్, పశువైద్యాధికారి అల్తాఫ్ హుస్సేన్, పాడి రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



బంటుమిల్లి: విద్యార్థులు చదువుతోపాటు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి ఎం. భాస్కరరావు సూచించారు. సోమవారం స్థానిక వాగ్దేవి జూనియర్ కాలేజీలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఫోక్సో, మైనర్ వివాహం తదితర చట్టాలపై అవగాహన కలిగించారు. అలాగే మాదకద్రవ్యాలు భవిష్యత్తును అందకారం చేస్తాయని హెచ్చరించారు. అలాగే పలువురు న్యాయవాదులు పలు చట్టాలను వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. శ్యాంబాబు, న్యాయవాదులు పి.వి. వెంకటేశ్వరరావు, టి. సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌కు బస్సు సౌకర్యం కల్పించాలి

బంటుమిల్లి: ఆల్ ఇండియా మెడికల్ సైన్స్(ఎయిమ్స్) హాస్పిటల్ గుంటూరు జిల్లా మంగళగిరికి బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని వృద్ధుల సంక్షేమ సంఘం మండల కమిటీ సభ్యులు తహసీల్దార్ కేవీ పూర్ణచంద్రరావును సోమవారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఎయిమ్స్‌కు బస్సు సౌకర్యం కలిగించేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడాలని కోరారు. సంఘ అధ్యక్షుడు గంగాజలరావు, సభ్యులు యాళ్ల శ్యాంబాబు, ఎం. శివప్రసాదు, కే. నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు సిద్ధం

నాగాయలంక: నాగాయలంక ప్రసన్న గణపతి దేవస్థానం ఆధ్వర్యంలో 68వ వినాయక నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఈ మేరకు దేవస్థానం కమిటీ నేతృత్వంలో ఉత్సవ కమిటి పర్యవేక్షణలో 17రోజులు జరిపే ఉత్సవాలకు గత వారం రోజుల నుంచి భారీ పందిరి నిర్మాణం, ఉత్సవ విగ్రహ వేదిక, చాందినీ అలంకారం తదితర పనులు పూర్తి చేశారు. బుధవారం శాస్త్రోక్తంగా స్వామివారి 12 అడుగుల ఉత్సవ విగ్రహం మందిర ప్రవేశంతో వార్షిక ఉత్సవాలకు శ్రీకారం జరుగుతుందని కమిటీ ప్రతినిధులు చెప్పారు. ఆనవాయితీ ప్రకారం అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యాశ్రీ ఉత్సవాలు ప్రారంభిస్తారు.

పీ-4 మార్గదర్శిలను గుర్తించండి

కలెక్టర్ డీకే బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): పీ-4 మార్గదర్శకాలను విధిగా పాటిస్తూ మార్గదర్శిలను గుర్తించాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మతో కలిసి పీ-4 కార్యక్రమం పురోగతిపై నియోజకవర్గాల ప్రత్యేకాధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 53,759 మంది పేద కుటుంబాల వారిని బంగారు కుటుంబాలుగా గుర్తించామని చెప్పారు. అందులో 48,549 బంగారు కుటుంబాలను 4,294 మార్గదర్శిలకు దత్తత తీసుకునేలా అనుసంధానం చేశామన్నారు. ఇందులో ఇంకా మార్గదర్శులను గుర్తించి భాగస్వామ్యం చేయాలని సూచించారు. సమావేశంలో సీపీవో భీమరాజు, డ్వామా, మెప్మా పీడీలు శివప్రసాద్, సాయిబాబు, పశుసంవర్ధకశాఖ జేడీ చిన నరసింహులు, మార్కెటింగ్ ఏడీ నిత్యానందం, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యం

జిల్లాలో గ్రామ పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశపు హాలులో పంచాయతీ అభివృద్ధి సూచికలు - పరివర్తనపై ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి కొన్ని అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించి ఉత్తమ మార్పులు సాధించిన పంచాయతీలకు కోటి రూపాయలకు పైగా ప్రోత్సాహక నిధులను మంజూరు చేస్తోందన్నారు. ఇందు కోసం అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, మొవ్వ మండలం డెప్యూటీ ఎంపీడీవో పరమాత్మ, పలువురు జెడ్పీటీసీలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



పెడనలో ఎరువుల దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు



చల్లపల్లిలో ఎరువుల షాపులను పరిశీలిస్తున్న జాయింట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు

పెడన: రెవెన్యూ, వ్యవసాయం, పోలీస్ శాఖల అధికారులు సోమవారం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇప్పటి వరకు యూరియా ఎంత వచ్చింది, ఎంత విక్రయించారు, ఎప్పటి వరకు విక్రయించారు, స్టాక్ ఇంకా ఏమైనా ఉందా అనే విషయాలపై ఆరా తీయడమే కాకుండా స్టాక్ రిజిస్టర్ పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి తహసీల్దారు కె.అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎవరైనా ఎరువులు అధిక ధరలకు అమ్మినట్లయితే వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. అలాగే రైతులకు ఎరువులు అమ్మిన వెంటనే ఈ-పాస్ తప్పనిసరిగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఏఓ ఎస్.జెన్నీ, ఎస్ఐ జి.సత్యనారాయణ, ట్రైనీ ఎస్ఐ నాగరాజు, విజిలెన్స్ సిబ్బంది వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చల్లపల్లి: మండలంలోని పలు ఎరువుల షాపులను జాయింట్ టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. వ్యవసాయాధికారి కె.మురళీకృష్ణ, ఎస్ఐ పీఎస్వీ సుబ్రహ్మణ్యం, తహశీల్దార్ వనజాక్షి తనిఖీ చేశారు. ఎప్పటికప్పుడు స్టాకు వివరాలను వాటి ధరలను తెలుపుతూ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

తేనెటీగల పరిశ్రమపై అవగాహన

మోపిదేవి: కేంద్ర ప్రభుత్వ సహకారంతో కల్పిస్తున్న తేనెటీగల పరిశ్రమకు గ్రామీణ ప్రాంతాల్లో మంచి అవకాశాలు ఉంటాయని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల (కేవీఐసీ) రాష్ట్ర డైరెక్టర్ ఎస్.గ్రీప్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో తేనెటీగల పరిశ్రమపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ఎవరైనా ఈ పరిశ్రమను ఏర్పాటు చేసుకోవచ్చునని తెలిపారు. ఒక్కో యూనిట్‌కు బ్యాంకులు 95 శాతం సబ్సిడీ ఇవ్వగా లబ్ధిదారులు కేవలం 5 శాతం పెట్టుబడి పెడితే పరిశ్రమను ఏర్పాటు చేయవచ్చునని అన్నారు. ఎంపీపీ రావి దుర్గావాణి, ఎంపీడీవో జె.స్వర్ణభారతి, ఏపీకేవీఐబీ ఏడీ సర్వన్ కుమార్, హార్టీకల్చర్ అధికారి ఎన్.రమేష్, ఏడీ-2 కేవీఐసీ ఆర్ఎల్ఎన్ మూర్తి, బీకీపింగ్ నిపుణులు బి.అభినాష్, కె.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేత




స్మార్ట్ రేషన్ కార్డులను చూపుతున్న తహసీల్దారు అనిల్‌కుమార్

పెడన: పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న 47 రేషన్ దుకాణాలు ద్వారా 20,656 స్మార్ట్ రేషన్ కార్డులు జారీ చేసినట్లు పెడన ఇన్‌ఛార్జి తహసీల్దారు కె. అనిల్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన తన ఛాంబరులో రేషన్ డీలర్లకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ కార్డులను సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ తీసుకెళ్లి అందజేస్తారని అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డు అందని వారుంటే ఎక్కడైతే రేషన్ తీసుకుంటున్నారో ఆ రేషన్ షాపు వద్ద స్మార్ట్ కార్డు అందజేస్తారని తెలిపారు. సర్వే డీటీ సల్మాబేగం తదితరులు పాల్గొన్నారు.

తెలుగురావుపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలానికి 9,260 స్మార్ట్ రేషన్ కార్డులు రాగా 1,134 కార్డులను పంపిణీ చేసినట్లు తహసీల్దార్ బి.విజయప్రసాద్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పీడీఎస్ డీటీ కొడాలి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఆరుంబాక రవి, ఈవోలు జి.సుధాకర్, నాగమణి, నయూమ్, శ్రీనివాసరావు, వీఆర్వోలు పి.కోటేశ్వరరావు, దగాని గోపి, శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: మండలంలోని ముంజులూరు గ్రామంలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ కారణంగా ప్రజలకు రేషన్ సరుకులు నిబంధనల మేరకు అందుతాయన్నారు. మండలంలో 14,982 రేషన్ కార్డులు ఉన్నాయని తహసీల్దార్ కేవీ పూర్ణచంద్రరావు తెలిపారు. ఆర్ఐ బి. శంకర్, పీడీఎస్ డీటీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరి వంగడాలు పరిశీలన



వరి పొలాలు పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

వేములపల్లి(ఘంటసాల): చిరుసంచుల దశలో పండిస్తున్న వరి వంగడాలను ఘంటసాల కేవీకే శాస్త్రవేత్తలు సోమవారం పరిశీలించారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మండలంలోని వేములపల్లి, చినకళ్లేపల్లి గ్రామాల్లో పండిస్తున్న వరి వంగడాలు బీపీటీ 3284, ఆర్‌జీఎల్ 7034, ఆర్‌జీఎల్ 7045 రకాల పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీంచారు. ఆయా గ్రామాల్లో సాగులో ఉన్న మారేటేరు రకాలు ఎంటీయూ 1318, ఎంటీయూ 1061, బాపట్ల రకాలతో చిరు సంచుల దశలో వేసిన వరి వంగడాలు పనితీరు, మొక్క ఎత్తు, పిలకల సంఖ్య, పురుగు తెగులు తట్టుకునే శక్తి మొదలగు అంశాలను పోల్చి చూసినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, డాక్టర్ కె.రేవతి, రైతులు పాల్గొన్నారు.

ఘంటసాలపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం ఘంటసాలపాలెం, కొడాలి గ్రామాల్లో ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సామాజిక కళాశాల విద్యార్థినులు సోమవారం ఆయా గ్రామాల నమూనా పటాలను చిత్రీకరించారు. కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు, విద్యార్థినులు పాల్గొన్నారు.